ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	581.30 (286.7635)	1,20,339	36,033
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,736.89	1,736.89
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.411 (20.5877)	32,064	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

పరిషత్ ఎన్నికలపై
కమలం కన్ను



- ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించే వారంతా జడ్పీటీసీలుగా బరిలోకి
- ఎంపీటీసీ స్థానాల్లో బలమైన పోటీకి సన్నాహాలు
- స్పష్టమైన ఆదేశాలిచ్చిన అధిష్ఠానం
- పార్లమెంట్ ఎన్నికల ఊపును కొనసాగించాలని సూచన
- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే వ్యూహం

పార్లమెంట్ ఎన్నికల ఊపును పరిషత్ ఎన్నికల్లో కొనసాగించాలని బీజేపీ నిర్ణయించింది. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థిత్వం ఆశించాలంటే పరిషత్ ఎన్నికల్లో పనితీరు కొలమానంగా భావిస్తామని అధిష్ఠానం తేల్చిచెప్పింది. దీంతో బీజేపీ ముఖ్య నాయకులు ఆయా నియోజకవర్గాల్లో జడ్పీటీసీలుగా పోటీచేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఎమ్మెల్యేగా పోటీచేయాలని ఆశిస్తున్న నాయకులంతా వారు ఆయా నియోజకవర్గం పరిధిలో ఏదో ఒక మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేయాలని పార్టీ సూచించింది. జడ్పీటీసీ సభ్యులుగా కీలక నాయకులంతా పోటీలో ఉండడంతో పాటు ప్రతీ ఎంపీటీసీ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిని నెలబెట్టడమేగాక కీలకమైన స్థానాలు గెలవాలని నిర్దేశించింది. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి చంద్రశేఖర్ తివారీ ఈ మేరకు ముఖ్య నేతలకు సూచించడంతో ఇటీవల జరిగిన జిల్లా, మండల స్థాయి వర్క్‌షాపులలో ఈమేరకు స్పష్టమైన ఆదేశాలు, కార్యాచరణను ఖరారు చేశారు. కమలం పార్టీ ద్వారా రాజకీయ భవిష్యత్ ఆశిస్తున్న నాయకులు ఇప్పటికే తాము పోటీచేయడానికి మండలాలను ఎంచుకునే పనిలో పడగా, మరికొందరు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

క్షేత్రస్థాయి బలోపేతానికి కార్యాచరణ

గడచిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో మొత్తంగా ద్వితీయ స్థానంలోకి నిలవగా, అసెంబ్లీల వారీగా పరిశీలిస్తే నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. మిగిలిన నియోజకవర్గాల్లో మూడో స్థానంలోకి వచ్చినా ఓట్లు గణనీయంగా పెరిగాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉన్న అధిష్ఠానం అందుకు పరిషత్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. పరిషత్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను దింపడం ద్వారా అధికార పార్టీకి సవాల్ విసరడమే కాకుండా, వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలిచేందుకు ఇప్పటినుంచే కార్యాచరణ అమలు చేయాలని సూచించింది. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయాలని ఉవ్విళ్లూరే నాయకులు ఈ పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాలకు పోటీచేసిన నాయకులు, ఎమ్మెల్యే టికెట్ ఆశించిన నాయకులతో పాటు, భవిష్యత్‌లో ఎమ్మెల్యేగా పోటీచేయాలని భావించే నాయకులంతా పరిషత్ ఎన్నికల్లో వారి నియోజకవర్గాల్లో ఏదో ఒక మండలం నుంచి జడ్పీటీసీగా పోటీచేసి గెలవాలని పార్టీ సూచించింది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌తో పాటు, జిల్లా, మండల స్థాయి వర్క్‌షాప్‌లలో క్యాడర్‌కు సైతం ఈ విషయంపై స్పష్టమైన కార్యాచరణ అందించింది. ఎంపీటీసీ స్థానాలకు సైతం నామమాత్రంగా పోటీచేసే విధానానికి స్వస్తి చెప్పాలని సూచించింది. ప్రతీ ఎంపీటీసీ స్థానం పరిధిలో ఓటర్ల జాబితాలు, స్థానిక పరిస్థితులు, అక్కడున్న సామాజిక స్థితి, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకొని, గెలవాలంటే ఎలాంటి వ్యూహం అమలు చేయాలో నిర్ణయించాలని సూచించింది. ఎంపీటీసీ స్థానానికి పోటీ చేయడానికి పార్టీలో సమర్థ నాయకులు లేకుంటే తటస్థులు, ఆ ప్రాంతంలో పేరు ప్రఖ్యాతులన్న వారిని పార్టీలోకి ఆహ్వానించి, వారిని పోటీకి ఒప్పించే బాధ్యతను సైతం జడ్పీటీసీ సభ్యులుగా పోటీచేసేవారే తీసుకోవాలని దిశానిర్దేశం చేసింది. ఇప్పటినుంచే ప్రాదేశిక నియోజకవర్గాలు, మండలాలు, జిల్లాల వారీగా ప్రజల సమస్యలు గుర్తించి వాటిపై పోరాటాలు ప్రారంభించాలని, ఆ పోరాటాలే ప్రచారస్త్రాలుగా మలుచుకోవాలని

మిగతా 8వ పేజీలో...

నిద్రలోనే అనంతలోకాలకు

- చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు డీఎస్పీలు మృత్యువాత, ఒక ఏఎస్పీ, హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు
- మృతులు, క్షతగాత్రులంతా ఏపీ రాష్ట్రవాసులు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం, (ఇన్‌సెట్‌లో) ఈ డివైడర్‌కు ఢీకొట్టడంతో వాహనం ఎగిరిపడింది

ఇంకో గంటలో గమ్యాన్ని చేరుకుంటారనే లోపే మృత్యువు చేరువైంది. విధి నిర్వహణలో అలసిపోయిన వారు, కొంచెం సేపు కునుకు తీద్దామనుకుంటే.. శాశ్వత నిద్ర దగ్గరైంది. దీంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మృతి చెందగా, ఒక ఏఎస్పీ, మరో హెడ్‌కానిస్టేబుల్ గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా హైదరాబాద్ వెళుతుండగా, తెల్లవారుజామున 4.45కు ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో, ఆ వాహనాన్ని తప్పించబోయి వీరు ప్రమాదం బారిన పడ్డారు.

వివరాలు ప్రధాన సంచికలో..

ఎరువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాడ్గులపల్లిలో సొసైటీని తనిఖీచేసి వివరాలు అడిగితెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగార్జున డిస్ట్రిక్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీని ఆయన తనిఖీచేసి రికార్డులను, ఎరువుల స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. డీలర్లు ఈ-పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, వ్యవసాయేతర అవసరాలకు మళ్లించే దుకాణదారులపై చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జేడీఏ శ్రవణ్‌కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం జ్యోతి, డీసీవో పత్యానాయక్, ఏవో శివరాంకుమార్, డీలర్లు యాదగిరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కర్లపాటి శ్రీను, ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

(ఆంధ్రజ్యోతి, వేములపల్లి): పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన యూరియా విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని ఆయన తనిఖీచేసి యూరియా గోదాం, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన ప్రతీ యూరియా బస్తాను రైతులకే అందించాలన్నారు. జిల్లాలో సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు సైతం మోతాదుకు మించి వినియోగించవద్దని సూచించారు. పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన యూరియాను ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించి సరఫరా చేయాలన్నారు. విక్రయించిన ఎరువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా సహకార అధికారి పత్యానాయక్, జేడీఏ శ్రవణ్‌కుమార్, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణ, మార్కెటింగ్ జిల్లా మేనేజర్ జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ జడరాములుయాదవ్, ఏవో కిశోర్‌నాయక్, మార్కెటింగ్ ఇన్‌చార్జి స్వామి, ఏఈవో నితిన్, సీఈవో రవీందర్‌రావు, రాజు, యువాన్, గిరి, యాదగిరి, సూరి ఉన్నారు.

యూరియాను పక్కదారిపట్టిస్తే క్రిమినల్ కేసు

- పరిశ్రమలు ఇండస్ట్రియల్ యూరియానే వినియోగించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్



చిట్యాల మండలంలో డీఈఎఫ్ ఆయిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాలరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని రాయితీ యూరియాను ఎవరైనా పక్కదారి పట్టిస్తే ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. శనివారం చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఎడీబ్లూ డీఈఎఫ్ ఆయిల్ విక్రయించే కౌంటర్‌ను కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. డీఈఎఫ్ ఆయిల్‌లో కలిపే యూరియా ఎలా వస్తుందో పరిశీలించారు. పంటపొలాలకు వినియోగించే రాయితీ యూరియాను కేవలం వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, ఇతరత్రా అవసరాలకు కాదన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయించే ఎరువులు, యూరియాపై అధికారులు నిఘా ఏర్పాటుచేయాలని సూచించారు. అదేవిధంగా యూరియా సరఫరా, విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేయడమేగాక ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, చెక్‌పోస్టులు కూడా ఏర్పాటుచేశామన్నారు. పరిశ్రమలు రాయితీ యూరియాను వినియోగిస్తున్నట్టు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట జేడీఏ శ్రవణ్‌కుమార్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జి.కృష్ణ, వ్యవసాయాధికారి గిరిబాబు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, చిట్యాల): చిట్యాల ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘంలోని ఎరువుల స్టాక్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. యూరియాను వినియోగించే అనుమానాస్పద పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): విద్యార్థులకు చదువుపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర కళాశాలను వారు తనిఖీచేశారు. తరగతి గదులను, నిత్యావసర వస్తువుల స్టోర్‌రూంను పరిశీలించారు. సమస్యలపై ప్రిన్సిపాల్‌ను అడగ్గా, అద్దె భవనంలో కొనసాగుతోందని, పక్కా భవనం నిర్మాణంలో ఉందని వివరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశలను నిజం చేసేలా చదవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, మేధస్సును పెంచే ఆటలపై ఆసక్తి చూపించాలన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి బారిన పడిన యువకుల జీవితాలు ఎలా నాశనమయ్యాయో వివరించి హెచ్చరించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకుంటూ భావి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో అధ్యాపకుల అవతారమెత్తి జీవిత పాఠాలు చెప్పారు. వారి వెంట ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, ఆర్ఐ తరుణ్, తదితరులు ఉన్నారు.

29న సాగర్ గేట్ల ఎత్తివేత?

- 581.30 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- గరిష్ఠ నీటిమట్టానికి మరో తొమ్మిది అడుగుల దూరం

7

30న డిండి ప్రాజెక్టు నీటి విడుదల

- ప్రస్తుతం ప్రాజెక్టులో 16 అడుగుల నీటిమట్టం

7

మూసీ నుంచి విడుదలవుతున్న నీరు

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్

నల్లగొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ లీగల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ లీగల్ సెల్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ ద్వారా పదవులు పొందిన న్యాయవాదులు పార్టీ కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయ సహాయం అందించాలన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అడ్వకేట్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ బిల్లు పాస్ అవుతుందని అన్నారు. న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు నాంపల్లి నర్సింహ, ఏజీపీలు శ్రీనివాస్, వెంకటరెడ్డి, వీరయ్య, న్యాయవాదులు నామిరెడ్డి మోహన్‌రెడ్డి, మోమీన్ రోషన్ జమీర్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గొడకొండ్ల గ్రామపంచాయతీ వెంకటేశ్వరనగర్ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, మందుల లభ్యతను పరిశీలించారు. డెంగీ, మలేరియా చికిత్స కోసం అందుబాటులో ఉన్న ఆర్‌డీటీ కిట్ల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రుగ్మతలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

నేడు దేవరకొండకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్

దేవరకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 27న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు దేవరకొండలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన, 11 గంటలకు చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. మంత్రి పర్యటనకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ మాదిగ

నల్లగొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పెన్షన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ విమర్శించారు. శనివారం స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్‌దారుల సంక్షేమంపై అధికార, ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకొని పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే పెన్షన్‌దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ మరో పోరాటానికి శ్రీకారం చుడతారని హెచ్చరించారు. ఆగస్టు 1న మిర్యాల గూడలో దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల జిల్లా సన్నాహక సభను నిర్వహిస్తున్నామని, దీనికి మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. మాసారం వెంకన్నమాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జానకిరామయ్య చౌదరి, గాదె రమేష్‌మాదిగ, ఇరిగి శ్రీశైలంమాదిగ, కురుపాటి కమలమ్మ, కొత్త వెంకన్నయాదవ్, ఊదరి నవీన్, నక్కా అశోక్, మేడబోయిన నగేష్, యాదయ్య, ఉపేందర్, తుమ్మల లక్ష్మారెడ్డి, మదన్, బన్నీ, పాల్గొన్నారు.


ప్రేమకు ప్రతిరూపాలు తల్లిదండ్రులు

● పిల్లలు బాధ్యతగా ఉంటే అంతా మేలే

● నేడు పేరెంట్స్ డే

తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. పిల్లలు వారి ప్రేమకు చిహ్నాలు. వారి జీవిత ఆరాటం, పోరాటం అంతా పిల్లల బాగు, ఉన్నతి కోసమే. వారి ఆస్తిపాస్తులు, కీర్తి ప్రతిష్టలు, సామాజిక హోదా పిల్లలకు వారసత్వంగా లభిస్తాయి. తమ కష్టాలు పిల్లలకు రాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు అహోరాత్రులు శ్రమిస్తుంటారు. తమ ఇష్టాలను చంపుకుని జీవిస్తుంటారు. ఏదిచేసినా అంతమంగా పిల్లల కోసమే. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే. అయితే ఇటీవల ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్తున్న పిల్లలు తమ తల్లిదండ్రులను ఆశ్రమాల్లో చేర్పిస్తున్నారు. తమ జీవితాన్ని అంకితం చేసిన తల్లిదండ్రులు జీవిత చరమాంకంలో పిల్లలకు దూరంగా గడపాల్సి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)



గతంలో స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభించడం, ఉన్నదాంట్లోనే సర్దుకపోదాం అనే స్వభావంతో తల్లిదండ్రులు, కుమారులు, మనుమలు, మనుమరాళ్లతో ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లేవి. తప్పని పరిస్థితులలో ఒకరిద్దరి పిల్లలు ఇంటికి దూరమైనప్పటికీ కనీసం ఒక్క కుమారుడైనా తల్లిదండ్రులతో ఇంటిపట్టునే ఉండేవారు. ఈ మేరకు తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఎప్పటికప్పుడు అభిప్రాయాల వెల్లడి, సమష్టి నిర్ణయాలతో కష్టసుఖాలను సమపాలలో పంచుకునేవారు. దీంతో తల్లిదండ్రుల వృద్ధాప్య జీవితానికి భద్రత ఉండేది. కానీ నేడు పలు కుటుంబాలలో ఆర్థిక వెసులుబాటు గణనీయంగా పెరిగినప్పటికీ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరవుతున్నారు. ఉద్యోగం, ఉపాధి పేరిట పిల్లలు ఇతర ప్రాంతాలలో, మరికొద్ది మంది విదేశాలలో స్థిరపడటంతో తల్లిదండ్రులు జీవిత చరమాంకంలో వేదనకు గురవుతున్నారు. మరికొద్ది మంది తల్లిదండ్రులకు ఆర్థిక మనుగడ లేక పోవడంతో పిల్లలు వారి వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితులు నెలకొన్నాయి. మరికొన్ని కుటుంబాలలో ఆస్తుల కోసం తల్లిదండ్రులను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఏకంగా హత్య చేస్తున్న పరిస్థితులు నిత్యకృత్యమవుతున్నాయి. అలాగే ఆశ్రమాల్లో చేరుతున్న, పోషణ కోసం ప్రభుత్వ ట్రైబ్యునల్సును ఆశ్రయించాల్సిన పరిస్థితులు క్రమేపీ పెరుగుతున్నాయి. అలాగే పిల్లలకు ఆదర్శకంగా, భరోసాగా ఉండాల్సిన కొద్దిమంది తల్లిదండ్రులు కూడా తమ బాధ్యతలను విస్మరిస్తూ విలువలు లేని జీవితాలు సాగిస్తుండటంతో ఆ దుష్ప్రభావం పిల్లలపై అంతిమంగా సమాజంపై చూపుతోంది. పిల్లలు పెడదోవ పట్టడానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల వైఖరే ప్రధాన కారణమని వ్యక్తిత్వ వికాస నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భౌతికంగా దూరంగా ఉన్నప్పటికీ ఆర్థిక సంబంధాల బదులు మానవ సంబంధాలను కొనసాగిస్తే తల్లిదండ్రులు, పిల్లలు ప్రేమ బాధ్యతలతో కూడిన విలువల జీవితాలను సాగించవచ్చునని కుటుంబ సంబంధాల విశ్లేషకులు అంటున్నారు.

బాధ్యతలు తెలియాలి

పిల్లల వృద్ధి, చదువుల కోసం ఓ మోస్తారు దుస్తులను ధరించాలనే, నచ్చిన ఆహారాన్ని కడుపునిండా తినాలనే కనీస కోరికలను కూడా దాచుకుంటూ జీవితాలను త్యాగం చేస్తుంటారు తల్లిదండ్రులు. అలాంటి వారి పట్ల పిల్లలు బాధ్యతాయుతంగా ఉండాలి. వారి కనీస అవసరాలను తప్పనిసరిగా తీర్చాలి. వృద్ధాప్యంలో వైద్యం. పోషణభారాన్ని స్వీకరించాలి. ఈ బాధ్యతలను కుమారులతో పాటు కుమార్తెలు కూడా పంచుకోవాలి. కలసి ఉంటే ప్రతిరోజూ తప్పనిసరిగా పలకరించాలి, ఒకే ఊరిలో వేర్వేరు ప్రాంతాలలో ఉంటే కుటుంబంతో కలిసి వీలున్న ప్రతిసారీ వెళ్లి రావాలి. దూర ప్రాంతాలలో ఉంటే ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా మాట్లాడుతూ మనమల్లు, మనుమరాళ్లను చూపిస్తూ ఆనందాన్ని పంచాలి. వారిని గౌరవిస్తూ, వారి మాటలను ఓపికగా వింటే వారికి పెద్ద ఉపశమనమని పిల్లలు గ్రహించాలని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటిలో జరిగే శుభకార్యాలలో వారికి తప్పనిసరిగా ప్రాధాన్యమివ్వాలని, అదే సమయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి, భారం పెరగకుండా స్వీయ నియంత్రణ పాటించాలంటున్నారు. ఇలా ఎవరికి వారుగా బాధ్యతగా, ఓర్పుగా ఉంటే అందరికీ మేలే జరుగుతుందంటున్నారు.

మాకు అమ్మనాన్నలే ఆదర్శం..



జంపాల అంజయ్య, వీరలక్ష్మి దంపతులతో కుమార్తెలు

జిల్లా కేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన విశ్రాంత వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగి జంపాల అంజయ్య, వీరలక్ష్మి దంపతులకు ఐదుగురు కుమార్తెలు. వీరిని ఉన్నత చదువులు చదివించి వివాహం చేశారు. అంజయ్య ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ ఐదుగురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించేందుకు పలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. అందరూ పీజీ చదివి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. మొదటి కుమార్తె డాక్టర్ నళినికుమారి హైదరాబాద్‌లో, రెండో కుమారి డాక్టర్ ప్రసన్నకుమారి గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా, మూడో కుమార్తె డాక్టర్ సుమనకుమారి హైదరాబాద్‌లో ఎంఎన్‌సీ కంపెనీ బ్రాంచి మేనేజర్‌గా, నాలుగో కుమార్తె డాక్టర్ పావని కుమారి బెంగళూరు రేవా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఐదవ కుమార్తె డాక్టర్ పూర్ణిమకుమారి హైదరాబాద్‌లో శాస్త్రవేత్తగా స్థిరపడ్డారు. అయితే తమ ఉన్నతి కోసం తల్లిదండ్రులు పడిన కష్టాలను ఆ ఐదుగురు కుమార్తెలు నిరంతరం నెమరువేసుకుంటూ ప్రతిరోజూ ఫోన్ ద్వారా పలకరిస్తుంటారు. తాము కూడా తమ పిల్లల పెంపకంలో అమ్మానాన్నలను ఆదర్శంగా తీసుకుంటున్నామని గర్వంగా పేర్కొంటున్నారు.

ఆర్థిక సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్ ఫొటో)

డిండి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ ఆర్థిక సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నాగారం గ్రామానికి చెందిన జాజుల అనిల్(56) డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. 2022 జూన్ 22న 317 జీవోలో బదిలీపై మండలంలోని రూప్లాబనావత్‌తండాలో విధులలో చేరాడు. విద్యార్థులులేక పాఠశాల మూతపడడంతో కొంతకాలం వీరబోయినపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేశాడు. డిండి ఉన్నత పాఠశాలలో పనిచేసి ఈ విద్యాసంవత్సరం డిప్యూటేషన్‌పై మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గత ఐదు రోజులుగా పాఠశాలకు వెళ్లడంలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా అద్దెకు ఉంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. పక్క గదిలో ఉంటున్న మరో ఉపాధ్యాయుడు తన విధులు ముగించుకొని సాయంత్రం 4.30గంటల సమయంలో వచ్చి చూడగా అనిల్ ఉరివేసుకొని ఉండటాన్ని గుర్తించాడు. విషయాన్ని ఎంఈవోకు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

నీటి సంపులో పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

వలిగొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మోటారు పంపుసెట్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ ఓ కాంట్రాక్టు కార్మికుడు నీటిసంపులో పడి మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గుంటూరు జిల్లా బోడిపాలెం గ్రామానికి చెందిన కనికంటి వీరేంద్రచౌదరి(27) రెండేళ్ల నుంచి దివీస్ కంపెనీలో వాటర్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం వలిగొండ మండలం జాలుకాల్వ గ్రామశివారులోని దివీస్ కంపెనీ వాటర్‌ప్లాంట్ సంపులోని మోటారు పంపుసెట్‌ను సహోద్యోగులతో కలిసి మరమ్మతులు చేశారు. అనంతరం బయటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ నీటి సంపులో పడి మృతి చెందాడు. వీరేంద్రచౌదరి తండ్రి శ్రీనివాస్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మధుసూదన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

పెద్దవూర, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ సమీపంలో శనివారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం హాలియా పట్టణానికి చెందిన నర్మెట మధుసూదన్‌రెడ్డి(55) పెద్దవూరలో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ముసలమ్మచెట్టు స్టేజీ సమీపంలోకి రాగా అతను ప్రయాణిస్తున్న బైక్‌ను హాలియా నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న సిమెంట్ లారీ ఢీకొట్టడంతో మధుసూదన్‌రెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మధుసూదన్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మధుసూదన్‌రెడ్డి భార్య పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

బస్టాండ్‌లో మహిళ పర్సు చోరీ

మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు అపహరణ

సూర్యాపేటక్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులో నుంచి పర్సు చోరీకి గురైన సంఘటన శనివారం జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల వద్ద సూర్యాపేటకు వచ్చేందుకు ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కింది. సూర్యాపేట కొత్తబస్టాండ్‌లో బస్సు దిగగానే ఆమె వెంట తెచ్చుకున్న బ్యాగును పరిశీలించగా అందులో పర్సు కనిపించలేదు. పర్సులో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు ఉన్నాయి. బస్సు దిగే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రహించారు. వెంటనే పెట్రోలింగ్ చేసే పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా బాధితురాలని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు తెలపడంతో పోలీసులు కొత్తబస్టాండ్ పరిసరాల్లో గాలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి ఆచూకీ లభించలేదు. దీంతో బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పట్టణ పోలీసులు బయటకు తెలపకుండా గోప్యంగా ఉంచుతున్నారు.

దొండపాడు హిమాలయ మద్యం దుకాణం సీజ్



మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు

చింతలపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో హిమాలయ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడుగా ఉన్న బీమనబోయిన ప్రవీణ్ హిమాలయ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈ దుకాణం నుంచి నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు భావించి పైఅధికారుల ఆదేశాల మేరకు దుకాణ లైసెన్స్‌ను రద్దు చేసి, సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, రుక్మారెడ్డి, ధనుంజయ్, నరేష్ పాల్గొన్నారు.

హైఫై తెలుసా



సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలకేంద్రంలోని పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సందర్శించారు. అక్కడ ఉన్న నాలుగేళ్లలోపు ముగ్గురు చిన్నారులతో సరదాగా ఆడారు. హై ఫై అంటే ఏమిటో తెలుసా అడిగి పిల్లల చేతులతో చప్పట్లు చరుస్తూ కనిపించారు. చిన్నారులు ఏ జంకు లేకుండా సమాధానం చెప్పారు.

● ఆంధ్రజ్యోతి ఆత్మకూరు(ఎస్)

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ఆలేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడిని యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలో పోలీసులు శనివారం అరెస్టుచేశారు. ఎస్‌హెచ్‌వో సీఐ కొండల్ రావు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కంప విజయ్ ఆలేరు, భువనగిరి, జనగాం ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఇటీవల చోరీ పారిపోయాడు. ఇటీవల ఆలేరు పరిసరాల్లో దొంగల ఆచూకీ కోసం రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం పట్టణంలోని వరంగల్-హైదరాబాద్ జాతీయరహదారిపై ఉన్న చౌదరి దాబా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇరువురిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వాహనానికి సంబంధించిన పేపర్లు చూపకపోవడంతో స్టేషన్‌కు తీసుకవెళ్లారు. తాము వాహనం దొంగిలించిందని పేపర్లు లేవని తెలిపారు. వారు చేసిన చోరీలను అంగీకరిస్తూ వివరాలు ఇచ్చారు. ఆ వివరాలతో చోరీ చేసిన నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా నిందితుడు ద్విచక్రవాహనాలు దొంగిలించి జైలు జీవితం గడిపి విడుదలయ్యాడని సీఐ తెలిపారు. నిందితుడు విజయ్‌ను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితుడు నాలుగుసార్లు జైలుకెళ్లినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వినయ్, ఏఎ్ఐ ఆంజనేయులు, క్రైం పోలీసులు పాల్గొన్నారు.

నేడు సినారే సాహిత్య

పురస్కారాల ప్రదానం

భువనగిరి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సినారే సాహిత్య పురస్కారాలను ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో 11 మంది సాహితీవేత్తలకు ప్రదానం చేస్తున్నట్టు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో జరిగే కార్యక్రమాలనికి హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా రానున్నట్టు తెలిపారు. సాహితీ ప్రియులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

ఖచ్చితత్వపు లివర్ పరీక్షలకు ఫైబ్రోస్కాన్



బీబీనగర్ ఎయిమ్స్‌లో ఫైబ్రోస్కాన్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న శాంతాసింగ్, ఇతర అధికారులు

బీబీనగర్ ఎయిమ్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఫైబ్రోస్కాన్ అనేది హెపటైటిస్, ఫ్యాటీలివర్, సిరోసిస్ వంటి దీర్ఘకాలిక లివర్ వ్యాధులను తొందరగా, ఖచ్చితంగా గుర్తించడానికి ఫైబ్రోస్కాన్ ఉపయోగపడుతుందని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతాసింగ్ అన్నారు. శనివారం ఎయిమ్స్‌లోని జనరల్ మెడిసన్ విభాగం ఆధ్వర్యంలో ఫైబ్రోస్కాన్ సౌకర్యాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. లివర్ సంబంధిత వ్యాధుల నిర్ధారణలో ఇది ఒక పురోగవంతమైన ఆధునిక సాధనంగా నిలిచిందన్నారు. శరీరాన్ని కోయకుండానే వేగవంతమైన పరీక్షా పద్ధతిగా ఆయన తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలను క్లినికల్ ప్రాక్టీస్‌లో సమర్థంగా ప్రవేశపెట్టడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. పరిశోధన్మాతకపరమైన వైద్యసేవలకు అంకితమవడం సంస్థ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ అశోక్, డాక్టర్ అభిషేక్ ఆరోరా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విశాఖ జైన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో

పాడిగేదెలు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడి గేదె వద్ద రైతు ఆంజనేయులు

తుర్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి, ఆత్మకూరు(ఎం) మండలాల్లో శనివారం విద్యుదాఘాతానికి గురై పాడి గేదెలు మృతి చెందాయి. తుర్కపల్లి మండల కేంద్రానికి చెం దిన బిచ్చాల ఆంజనేయులు గేదె మేత కోసం తుర్కపల్లి-కీసర రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో బాధిత రైతుకు రూ.80వేల నష్టం వాటిల్లింది. పాడి గేదె మృతితో తనకు జీవనోపాధి పోయిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన రైతు దేవినేని వెంకన్న తన వ్యవసాయ బావి వద్ద మేతకోసమని పాడి గేదెను వదిలిపెట్టాడు. పొలంలోని ట్రాన్స్‌పార్మర్ ఎర్తింగ్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిందని రైతు వెంకన్న తెలిపాడు. సుమారు రూ.60 వేల గేదెను నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పల్లె నుంచి జాతీయస్థాయికి

ఎంపవరింగ్ ఇండియా 2047 జాతీయ స్థాయి సెమినార్ నిర్వహణకు ప్రొఫెసర్ పున్నయ్య



పున్నయ్య రచించిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు(ఫైల్)

మోత్కూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ ఎ. పున్నయ్య 2047నాటికి భారత దేశం ప్రపంచ దేశాల్లో బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించేలా అర్థశాస్త్రవేత్తలు, మేధావులతో జాతీయ స్థాయి సెమినార్లు నిర్వహించే స్థాయికి ఎదిగారు. ఆయన ప్రస్తుతం నిజామాబాద్ తెలంగాణ యునివర్సిటీ అర్థశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. 1992లో 178 ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు ఎర్త్ సమ్మిట్ నిర్వహించాయని, ఇందులో ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించుకోవాలని నిర్ణయించాయని ప్రొఫెసర్ పున్నయ్య తెలిపారు. 2015లో పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఉత్పత్తిని పెంచడం, వృథా తగ్గిండం లాంటి 17సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేంచుకు న్నారని తెలిపారు. ఈ దిశలోనే 2047నాటికి భారత దేశం స్వాతంత్ర్య దేశమై వందేళ్లు పూర్తి చేసుకునే నాటికి ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా అంటే ప్రస్తుతం 4 ట్రిలియన్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థను 30ట్రిలియన్లకు పెంచేలా ఎదగాలన్నది లక్ష్యమని వివరించారు. అందుకు చేస్తున్న కృషిలో భాగంగా ప్రధాని మోదీ 2023 డిసెంబరు 11న వికసిత్ భారత్ 2047 ప్రకటించారని, అందుకు సుస్థిర లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు పలు రకాల వ్యూహాలు రూపొందిస్తున్నారన్నారు.

బ్రోచర్ విడుదల : ఈ నేపథ్యంలో 2047 నాటికి సుస్థిర అభివృద్ధి సాధించడానికి ఏం చేయాలన్న దానిపై డాక్టర్ పున్నయ్య ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒక బ్రోచర్ విడుదల చేశారు. దానికి స్పందించి అమెరికా, సౌత్‌కొరియా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలతో పాటు భారత దేశంలోని పది రాష్ట్రాల విశ్వవిద్యాలయాలకు చెందిన 140మంది అర్థశాస్త్రవేత్తల నుంచి సమీక్షలు (పత్రాలు) అందాయి. వాటిపై చర్చించడానికి ఆయన ఆధ్వర్యంలోనే ఈ నెల 23, 24 తేదీల్లో నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో 70 మంది ఆర్థశాస్త్ర వేత్తలు, మేథావులు పత్రాలు సమర్పించారు.

ప్రొఫెసర్ పున్నయ్య నేపథ్యం



ప్రొఫెసర్ పున్నయ్య లక్ష్మీదేవికాల్వ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఎస్ఎస్‌సీ వరకు చిత్తలూరు హైస్కూల్లో, ఇంటర్మీడియట్, డిగ్రీ సూర్యాపేటలో, ఎంఏ ఎకనామిక్స్ ఉస్మాని యా యూనివర్సిటీలో చదివి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఎంఫిల్‌లో బంగారు పతకం సాధించారు. పీహెచ్‌డీ ఉస్మానియా యూనివర్సిటీలో చేశారు. 1996లో చింతపల్లి మండలంలో ప్రాథమిక పాఠశాల టీచర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మారుమూల గ్రామం నుంచి వెళ్లి 'ఎంపవరింగ్ ఇండియా 2047 స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించే స్థాయికి ఎదగడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీక్షణం.. ముగ్ధ మనోహరం !!



నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని పెద్ద చెరువులో జలకళ సంతరించుకుంది. పెద్ద చెరువులో నీటి కొంగలు సందడి చేస్తున్నాయి. శనివారం పెద్ద చెరువులోని నీటిలోని విహంగాల సందడి చూపరులను ఆకట్టుకున్నాయి. సూర్యోదయం వేళ భానుడి కిరణాలకోసం నిరీక్షిస్తూ బారులు తీరాయి. చెరువులోని చేపల కోసం కాచుకుని కూర్చున్న తీరు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పెద్ద చెరువు ప్రకృతి దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

●ఆంధ్రజ్యోతి భూదాన్‌పోచంపల్లి.



ఏపూరు ఏటిలో జలకళ

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని ఏపూరు గ్రామ ఏరు జలకళను సంతరించుకుంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఏటి సమీపంలోని పాతర్ల పహాడ్, ముక్కుడుదేవులపల్లి, రామన్నగూడెం, ఏపూరు, బొప్పారం, మిద్దన పల్లి, మక్తాకొత్తగూడెం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-ఆత్మకూరు(ఎస్)

'స్థానిక' ఎన్నికలపై కాలయాపన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా రిజర్వేషన్ల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తామని శాసనసభ, మంత్రి వర్గం ఆమోదించి గవర్నర్‌కు పంపారని గుర్తు చేశారు. బిల్లుపై గవర్నర్ సంతకం చేసి కేంద్రప్రభుత్వానికి పంపినా చట్టం చేయకుండా కేంద్రం కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నా రు. కేంద్రప్రభుత్వం దగ్గరకు రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన బిల్లులను పంపితే వాటిని ఆమోదించకుండా ఏళ్ల తరబడి ఆపుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల గడువు తీరి రెండేళ్లవుతున్నా కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి కేంద్రప్రభుత్వం దగ్గరకు ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్లాలని కోరారు. సకాలంలో ఎన్నికలు నిర్వహించపోవడం వల్ల స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోవడం వల్ల సమస్యలు పేరుకుపోయాయని అన్నారు ఈ నెల 29వ తేదీన నిర్వహించే మంత్రి వర్గ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, డి.మల్లేషం, శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రమీల, సయ్యద్ హా షం, ప్రభావతి, లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో నీటి కష్టాలు



జాతీయ రహదారిని దాటి బకెట్లలో నీళ్లను తీసుకెళ్తున్న విద్యార్థులు

నాగార్జునసాగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థు లు మూడు రోజులుగా నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల అవరణలో ఉన్న బోరు మోటారు మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు నానాకష్టాలు పడుతున్నారు. దీంతో కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం విద్యార్థులు జాతీయరహదారి 565ను దాటి రోడ్డు వెంట ఉన్న నల్ల వద్ద బక్కెట్లలో నీళ్లను వసతి గృహానికి తీసుకెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నమన్నామని విద్యారులు తెలిపారు. మోటార్లు మరమ్మతుకు గురై మూడు రోజులు గడుస్తున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని విద్యార్థుల వాపోతున్నారు. కొందరు వి ద్యార్థులు రెండు రోజులుగా స్నానాలు కూడా చేయలేదని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ఫోన్‌లో వివరణ కోరగా మోటార్లు మరమ్మతుకు గురయ్యాయని వాటిని మరమ్మతులు చేయిస్తున్నామని. 1300 మంది విద్యార్థులు ఉండటంతో నీటి సమస్య రావడం సహజం అని తెలిపారు.

యూరియాపై ఆంక్షలు

- ఎకరాకు ఒక బస్తా మాత్రమే విక్రయం
- రైతు ఆరు ఎకరాలు సాగు చేసినా ఇచ్చేది మూడు బస్తాలే...
- రోజుకు 5 టన్నులు మాత్రమే విక్రయం



తుర్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యూరియా విక్రయాల్లో ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలకేంద్రంలో కేవలం పీఏసీఎస్ కేంద్రంలో మాత్రమే యూరియా అమ్మకాలు నిర్వహిస్తున్నారు. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ సాగు పనులు నిలిచిపోయాయి. అదును దాటిపోతుందని, వరినారు ముదిరిపోతుందేమోనని రైతుల్లో ఆందోళన నెలకొన్నది. కానీ నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. యూరియా కోసం రైతులు యూరియా విక్రయ కేంద్రాలకు బాట పట్టారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం యూరియా కొరత లేదని ఓ వైపు పేర్కొంటున్నారు. కానీ యూరియా కోసం వెళ్లిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. గతంలో రైతు ఆధార్ కార్డు చూపిస్తే ఎన్ని సంచులైనా ఇచ్చేవారని రైతులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆదేశానుసారమే విక్రయం

ప్రభుత్వ ఆదేశానుసారమే యూరియా విక్రయాలు నిర్వహిస్తున్నాం. ఎకరాకు ఒక సంచే ఇవ్వాలని అధికారులు చెప్పారు. రైతు ఎక్కువ మొత్తంలో సాగు చేస్తే ఒక రశీదుపై మూడు సంచులు ఇస్తున్నాం. అంతకంటే ఎక్కువ కావాలంటే వ్యవసాయాధికారుల అనుమతి తీసుకొని వారి సూచన మేరకు ఇస్తున్నాం

- రమేష్, పీఏసీఎస్ కార్యదర్శి, తుర్కపల్లి

ఎకరాకు ఒక బస్తా

తుర్కపల్లి మండలంలో ప్రస్తుతం రైతులకు ఎకరాకు కేవలం ఒక బస్తా యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారు. మండల కేంద్రానికి వివిధ గ్రామాల రైతులు యూరియా కోసం వస్తే ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం జీరాక్స్‌లు ఇస్తేనే ఎకరాకు ఒకటి చొప్పున ఇస్తున్నారు. ప్రస్తుతం యూరియా కోసం వచ్చే రైతులకు మాత్రం ఎకరాకు కేవలం ఒక బస్తా యూరియా సంచి మాత్రమే ఇస్తున్నారు. ఒకవేళ పెద్ద రైతులు ఒకటి కంటే ఎక్కువ ఎకరాల్లో సాగు చేసినా కూడా ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారు. ఆరు ఎకరాలు ఉంటే నాటు పెడితే ఎకరాకు ఒకటి చొప్పున 6 యూరియా సంచులు ఇవ్వాలి. కానీ ఆ రైతుకు మాత్రం మూడు సంచులు వరకు ఇస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులు ఒకేసారి 6 యూరియా సంచులు తీసుకువెళ్లడానికి ఆటోలు తీసుకొని వస్తున్నారు. కానీ ఎకరాకు ఒకటి కంటే ఎక్కువ ఆంక్షలు విధించడంతో ఆటో కిరాయిలు మీద పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు పీఏసీఏస్ కేంద్రంలో 5టన్నులు (111 యూరియా సంచులు) మాత్రమే విక్రయిస్తున్నారు. లక్ష్యాన్ని చేరకుంటే మరుసటి రోజు రావాల్సిందేనని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మండలంలో అడుగు మందు మాత్రం అసలు దొరకడమే లేదు.

ఆంక్షలు ఎత్తివేయాలి




యూరియా విక్రయానికి పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలి. నాకు 8 ఎకరాల భూమి ఉంది. 6 ఎకరాల్లో వరి సాగు చేశాను. యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రానికి వచ్చాను. కార్యాలయంలో సిబ్బంది తనకు కేవలం మూడు బస్తాలే ఇస్తామన్నారు. మిగతా మూడు ఎకరాల పరిస్థితి ఎలా అని ప్రశ్నించగా మూడు రోజులకు రమ్మని చెప్పారు. దీంతో తన కుటుంబ సభ్యులకు సంబంధించిన పాస్ పుస్తకాలు జీరాక్స్ ఇచ్చి తీసుకోవాల్సి వచ్చింది.

- కల్లూరి వెంకటనర్సింహారెడ్డి, రైతు, వెంకటాపూర్, తుర్కపల్లి

29న సాగర్ గేట్ల ఎత్తివేత?

● 581.30 అడుగులకు చేరుకున్న సాగర్ నీటిమట్టం ● గరిష్ఠ నీటిమట్టానికి మరో తొమ్మిది అడుగుల దూరం



మూసీ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఈనెల 29న ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున్‌రావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 2007లో జూలైలో ప్రాజెక్టు గేట్లు ఎత్తగా, 18 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ఏడాది జూలై నెలలోనే క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. సాగర్‌కు ఈ నీటి సంవత్సరంలో జూన్ 30వ తేదీ నుంచి వరద రాక మొదలైంది. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ఠస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 581.30 అడుగులకు (286.7635టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టు నీటిమట్టం మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయికి (590 అడుగులు) చేరే అవకాశం ఉందని ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున్‌రావు తెలిపారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 511 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 4,287 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,435 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం36,033క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 1,20,339 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాల్వలకు ఎటువంటి నీటి విడుదల లేదు.

కొనసాగుతున్న మూసీ నీటి విడుదల

మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి వరద నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగర పరిసరాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రెండు, మూడు రోజులుగా ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో అధికారులు శుక్రవారం ప్రాజెక్టు రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి ఎగువ నుంచి వస్తున్న మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో నిరాటంకంగా కొనసాగుతుండటంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు గేట్ల నిర్వహణను కొనసాగిస్తున్నారు. ఎగువ నుంచి 1736.89 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.50 అడుగులు (4.07టీఎంసీలు) వద్ద నిలకడగా ఉంచుతున్నారు. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడికాల్వకు 263.83 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 215.86 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ ఎగువ నుంచి వసున్న వరద నీటిలో 1184.25 క్యూసెక్కుల నీటిని 3, 8 నెంబరు క్రస్టుగేట్ల ద్వారా దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు.



నిండు కుండలా నాగార్జునసాగర్ జలాశయం

30న డిండి ప్రాజెక్టు నీటి విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు ఈఈ యలమంద

డిండి: డిండి ప్రాజెక్టు నీటిని ఈ నెల 30వ తేదీన ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ యలమంద తెలిపారు. మండల కేంద్రంలోని నీటి పారుదల అతి థిగృహంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు (2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో 16అడుగుల మేర(0.433 టీఎంసీ) నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఈ వానాకాలం వరి నార్లు పోసుకునేందుకు అదును దాటిపోతుండటంతో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని తూములకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ఆయకట్టులోని 12,500 ఎకరాలకు ఈ నిల్వ ఉన్న నీరు 20రోజులు సరిపోతుందని పేర్కొన్నారు. వర్షాలు కురిసి ప్రాజెక్టులో నీరు చేరుతుందనే ఆశతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



కవచమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు ప్రారంభమయ్యాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్ల ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వర స్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు,నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొన సాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,74,542 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

గుట్ట ఆలయంలో తిరునక్షత్రోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం ఆండాళ్ అమ్మవారికి పూజారులు తిరునక్షత్రోత్సం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి దివ్య ప్రబంద పారాయణాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉపప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రచార్యులు, ఏఈవో జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్, నాగుల మహేష్ పాల్గొన్నారు.

4 నుంచి పవిత్రోత్సవాలు

స్వామివారి ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో ఆగస్టు 4 నుంచి 6తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా 5 నుంచి 6 తేదీ వరకు రెండురోజుల పాటు నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహోత్సవం, లక్ష పుష్పార్చన, సుదర్శన నారసింహ హో మం రద్దు చేసి తిరిగి 7న పునరుద్ధరించనున్నట్లు వివరించారు.

టెండర్ ఆహ్వానం వివాదాస్పదం

యాదగిరగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శుక్రవారం విడుదల చేసిన టెండరు ప్రకటన వివాదస్పదంగా మారింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలో 'ఇందిర మహిళా శక్తి' పేరుతో క్యాంటిన్ నిర్వహణకు 3 ఏళ్ల కాలపరిమితి రూ. లక్ష డిపాజిట్‌తో టెండరు ఆహ్వానిస్తూ అధికారులు ప్రకటన జారీ చేశారు. కాం గ్రెస్ ఉనికి కోసమే క్షేత్ర పరిధిలో వ్యాపారం పేరుతో ప్రచారం చేస్తోందని బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తక్షణమే టెండరు ప్రకటనను ఉపసంహరించుకోవాలని ఫిర్యాదు చేశారు. 'ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ పేరుతో దేవస్థానంలో మహిళ సంఘం సభ్యులు వ్యాపార అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశించినట్లు డీఈవో దోర్బల భాస్కరశర్మ వివరించారు. అభ్యంతరాలు వ్యక్తమవుతున్నందున పునఃపరిశీలనను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి జూలై 26 (ఆంధ్రజ్యోతి): : మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శనివారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నృసింహుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

● వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్



అరుణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భారత లవకుమార్, నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్క్ చీరల ఉత్పత్తి దారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ ఆద్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు వీవర్ సర్వీస్ సెంటర్ అధికారి అరుణ్ కుమార్‌ను కలిసి చేనేత సమస్యలపై చర్చించారు. పోచంపల్లి చేనేత పరిశ్రమ అభివృద్ధికి పలు విషయాలపై చర్చించారు. అందుకు సహకరించాల్సిందిగా ఆయన అధికారిని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ వ్యాపారులకు సహకరించాల్సిందిగా కోరారు. చేనేత వాప్యారులతోపాటు కార్మికులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు అయ్యేలా చూ డాలని కోరారు. సమస్యలపై వినతి పత్రాన్ని అందజేయగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. చేనేత సమస్యల పరిష్కారానికి తన వంతుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, కార్యదర్శి ముసుకూరి నర్సింహ, ఉపాధ్యక్షులు ఈపూరి ముత్యాలు, కుడికాల రామనర్సింహ, కోశాధికారి మంగళపల్లి రమేష్, సహాయ కార్యదర్శి గంజి బాలరాజు, కందగట్ల శంకరయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి



నకిరేకల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బెల్లి జనార్దన్

నకిరేకల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని నటుడు, నిర్మాత ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బెల్లి జనార్దన్ సూచించారు. నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రస్మా సహకారంతో శనివారం ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన యువ వికాస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మెలగాలన్నారు. దానివల్ల కలిగే నష్టాలు ఎల్ఈడీ స్క్రీన్‌పై విద్యార్థులకు కళ్ల కు కట్టినట్లు వివరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి, ప్రోగ్రాం చైర్మన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మోహన్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ సతీష్‌కుమార్, జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఎన్ రామ్మోహన్‌రావు, మండల విద్యాధికారి నాగయ్య, ట్రస్ట్ కార్యదర్శి యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, క్లబ్ కార్యదర్శి సూర్య చందర్‌రావు, క్లబ్ ప్రతినిధులు గుర్రం అంతయ్య, దైద రవీందర్ పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరుల త్యాగం మరువలేనిది

● ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్



కార్గిల్ అమరులకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, క్యాడెట్లు

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో భారత జవాన్లు ప్రదర్శించిన ధైర్యం, త్యాగం మరువలేనిదని ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్ అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా శనివారం కళాశాలలో కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వార్థ రహితంగా దేశాన్ని రక్షించిన వీర సైనికుల కృషిని గర్వంగా స్మరించుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లలో ఈ భావాజాలాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయనా న్నరు. కార్యక్రమంలో క్యాడెట్లు పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్రిగూడ డిప్యూటీ తహసీల్దార్‌గా నిర్మలాదేవి

మర్రిగూడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ డిప్యూటీ తహసీల్దార్‌గా నిర్మలాదేవి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న చంద్రశేఖ ర్ చండూరు తహసీల్దార్ కార్యాలయానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. చండూరు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన నిర్మలాదేవి మర్రిగూడ మండల కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

రైతులకు సరిపడా యూరియా

తిప్పర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నట్లు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని శనివారం తిప్పర్తి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 24వేల మెట్రిక్ టన్నుల యూరియా, 30వేల టన్నుల పొటాష్ నిల్వలు ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు ఇలా... ప్రయాణమెలా..



బురదమయంగా మారిన కాలనీ రోడ్లు

మూడు రోజులు కురుస్తున్న వర్షానికి మట్టి రోడ్లు, కాలనీలు గుంతలు, బురదమయంగా మారాయి. దీంతో కాలినడకన వెళ్లాలంటే ఎక్కడ జారి పడతామోనని కాలనీవాసులు భయపడుతున్నారు. నల్లగొండ పట్టణ పరిధిలోని సాయినగర్ నుంచి ముషంపల్లి రోడ్డు సమీపంలోని గుట్ట వరకు చిత్తడిగా మారాయి. అధికం గా వాహనాలు తిరగడంతో పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. ఈ రోడ్లపై ద్విచక్ర వాహనదారులు గుంతల్లో నడపలేక కొద్దిమంది కింద పడి గాయాలపాలైన ఘ టనలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం తాత్కాలికంగా పనులు చేపడుతున్నారే త ప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అ ధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

-నల్లగొండరూరల్

ప్రమాదకరంగా గుంతలు



బస్టాండ్ ఎదుట వరదనీటితో ఏర్పడిన బురదగుంత

మునుగోడు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నెలకొన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షానికే ఆ గుంతల్లో వరద నీరు నిలిచి బురదమయంగా మారాయి. మోకాల్లోతు గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖద్వారంగా ఉన్న రహదారిపై ఏర్పడిన బురదగుంత మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రహదారి వెళ్తున్నా సమస్యను కనీసం పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో చిన్నగుంతలు ఉండగా మట్టిని నింపారు. అది చదును చేయక పోవటంతో సమస్య తీవ్రంగా మారింది. ఎగువ నుంచి దిగువ పక్కన ఓపెన్ మురికి కాల్వ ఉంది. గుంతలను పూడ్చివేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- మునుగోడు

కురుస్తున్న తరగతి గదులు



ఎల్లారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎ‌స్‌లో గదుల్లోకి చేరిన వాన నీరు

నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ హైస్కూల్‌లో తరగతి గదులు కురుస్తున్నాయి. వరుసగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి స్లాబ్ నుంచి వాన నీరు లీకవుతూ తరగతి గదుల్లోకి ప్రవేశించింది. దీంతో 8,9,10వ తరగతి విద్యార్థులను ఇతర తరగతి గదుల్లో సర్దుబాటు చేశారు. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనం కావడంతో పాటు అవి జీర్ణావస్థకు చేరినా కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో తరగతి గదుల్లోకి వాన నీరు స్లాబ్‌లు, పిల్లర్ల ద్వారా లీకై బెంచీలు తడుస్తున్నాయి. కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. పైగా ఇవే తరగతి గదుల్లో కంప్యూటర్ క్లాస్ బోర్డులు కూడా ఉండటంతో అవి చెడిపోకుండా వాటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పాత తరగతి గదులను కూల్చి వాటి స్థానంలో కొత్తవి కట్టాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినట్లు హెచ్ఎం హిమజ తెలిపారు.

- నార్కట్‌పల్లి

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కట్టంగూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కట్టంగూరు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అంబటి అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఎలాంటి విద్యార్హతలు లేకుండా పదవ తరగతిలో నేరుగా ప్రవేశం పొందవచ్చని, 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్ పూర్తి చేయని వారు ఇంటర్‌లో చేరవచ్చని ఆయన తెలిపారు.

ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో కట్టంగూరు జడ్పీ హైస్కూల్‌లో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భవిష్యత్తుపై యువత దృష్టి సారించాలి



మునుగోడులో సైకిల్ యాత్ర సభలో మాట్లాడుతున్న రవినాయక్

మునుగోడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు విద్యార్థులు, యువత భవిష్యత్తు మనుగడ కోసం దృష్టి సారించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవినాయక్, మల్లం మహేష్ అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, రుణయాప్‌లను నియంత్రించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్‌యాత్ర శనివారం మునుగోడుకు చేరింది. ఈ యాత్రకు మండల కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవినాయక్, మల్లం మహేష్ మాట్లాడారు. మారుతున్న కాలనుగుణంగా యువత భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ ముందుకుసాగాలని సూచించారు. కానీ వారు మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక దృక్పథంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కట్ట లింగస్వామి అధ్యక్షతన నిర్వహించిన సైకిల్‌యాత్రలో సభ్యులు పుల్లెంల శ్రీ కర్, వడ్డగాని మహేష్, గుండాల నరేష్, రాజేష్, చంద్రశేఖర్, గోపి, నరేష్, నరేష్, శ్రీకాంత్, సాయి, చరణ్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపు యాప్ ద్వారా పింఛన్ల అందజేత



యాప్ ద్వారా లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందజేస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలులో ఆసరా లబ్ధిదారులకు ముఖ గుర్తింపు యాప్ ద్వారా పింఛన్ డబ్బులను అందజేశారు. ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా ఆసరా పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అమ్మనబోలులో ప్రయోగాత్మకంగా ఆసరా పింఛన్లను అందజేశారు. మొబైల్ ఫోన్‌లో ఉండే యాప్‌తో ఐ బ్లింకింగ్ చేయడం ద్వారా పింఛన్ ఇచ్చే విధానాన్ని వారు విజయవంతంగా నిర్వహించారు. సుమారు 57మంది పింఛన్‌దారులు యాప్ ద్వారా పింఛన్ డబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ కర్నాటి గోవర్ధన్, ఎంపీడీవో ఉమేష్‌చారి, తపాలా అధికారి రఘునాథస్వామి, పంచాయతీ కార్యదర్శి ఎలేందర్‌రెడ్డి, బీపీఎం దిలీప్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ప్రొసీడింగ్ ఆర్డర్స్ వెంటనే ఇవ్వాలి

● సీపీఎం నాయకులు సలీం, దండంపల్లి సత్తయ్య

నల్లగొండ రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం నిర్వహించిన డబుల్ బెడ్రూం లబ్ధిదారుల పోరాట సాధన కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 552 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణాలు పూర్తిచేసిన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో అనే పోరాటాలు చేసినట్లు తెలిపారు. ఆ క్రమంలో ఇల్లు లేని నిరుపేదల జాబితా తయారు చేసి విచారణ జరిపి, 3000 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అందులో నుంచి లాటరీ ద్వారా 552మందిని ఎంపిక చేసి ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా ఇల్లు ఇస్తామని, ఇవ్వకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారుల పోరాట సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు గంజి రాజేష్, ప్ర శాంతి, సిరాజుద్దీన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాకు వెళ్తున్న బస్సు కు జెండా ఊపి ప్రారంభించిన ఎండీ సలీం

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నల్లగొండరూరల్: ప్రభుత్వం వెంటనే రెండో పీఆర్సీ ప్రకటించి మినిమం వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలుచేయాలని తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు నల్లగొండ నుంచి వెళ్తున్న మునిసిపల్ కార్మికుల వాహనాలకు సలీం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రెండో పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులు అరికట్టాలని, నెలనెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, పీఎఫ్ ఈ ఎస్ఐ ప్రమాద బీమా సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇళ్లు లేని మునిసిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేతనాలు నిర్ణయించే వరకు దశలవారీగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, టౌన్ కన్వీనర్ దండెంపల్లి రవీందర్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కుల రవికుమార్, నాయకులు పెరిక కృష్ణ, పేర్ల సంజీవ, కత్తుల పద్మ, చిక్కుల రాములు, పాలడుగు వెంకటేశం, కాటేపల్లి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలి

● విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి



మొక్క నాటుతున్న విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడాలని విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్ విభాగం ఏడీఈ కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ విభాగం ఆవరణలో రైతులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ట్రాన్స్‌ఫార్మర్ కేంద్రం ఆవరణలో పెద్దఎత్తున మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. వనసంరక్షణతో పర్యావరణం కాపాడటంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులతో పాటు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేయాలి

మర్రిగూడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో ప్రతీ గ్రామంలో టీడీపీ జెండా ఎగురవేయాలని పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి పోలే మల్లేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బడుగు, బలహీన వర్గాల వారు రాజకీయ చైతన్యవంతులయ్యారని, ప్రజలకు సామాజిక న్యాయం జరిగిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు యాదయ్య, అంజయ్య, ఎల్లయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

● ఎంఈవో పానుగోతు సైదానాయక్



పాఠశాలలో కొత్త టీవీని ప్రారంభిస్తున్న ఎంఈవో సైదానాయక్

చిట్యాలరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటుగా ఆట-పాట, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉండాలని ఎంఈవో పానుగోతు సైదానాయక్ అన్నారు. చిట్యాల మండలం నేరడ ప్రాథమిక పాఠశాలలో నాలుగో శనివారం నోబ్యాగ్‌డే సందర్భంగా ఎల్లోడేగా నిర్వహించారు. విద్యార్థులతో ఆట-పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన జంపాల గోపాల్ తన తండ్రి హనుమంతు జ్ఞాపకార్థం విద్యార్థులకు టై, బెల్టులు బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో సైదానాయక్ మా ట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా ఉండాలంటే వారికి ఆటలు పాటలకు సమయమివ్వాలని, అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి నృత్యాలు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. అన్నిరంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు కూడా వారి పిల్లలపై శ్రద్ధ వహించాలన్నారు. చదువుకునే సమయంలో చదువుపై దృష్టిని సారించేలా చూడాలన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

నేరడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రంగా రామలింగయ్య పాఠశాలకు 32 ఇంచుల టీవీని బహూకరించారు. ఆ టీవీని ఎంఈవో సైదానాయక్ ప్రారంభించారు. విద్యాబోధనలు చేయడం వేతనం తీసుకోవడమే కాకుండా ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల కోసం టీవీని బహూకరించిన ఉపాధ్యాయుడిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వల్లం. నాగరాజు, ఉపాధ్యాయులు పి.హేమలత, రంగా రామలింగయ్య, పోశం లింగస్వామి, సుమలత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

గట్టుప్పల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మండల ఎన్నికల ప్రభారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి అన్నా రు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ గెలుపు కోసం నాయకులు, ప్రతీ కార్యకర్త బూత్ స్థాయిలో సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల యల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కన్వీనర్‌గా చిలివేరు దుర్గయ్య, ఓబీసీ ఉపాధ్యక్షుడు కంపే దుర్గయ్య, నాయకులు నాగులగాని శ్రీనివాసులు, ఇడం రాజు, జంపాల సుధాకర్, రాపోలు మార్కండేయ, నర్రా పరమేష్, జెల్ల విష్ణు, మండల పదాధికారులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు వంగూరి రవి

తిప్పర్తి: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు వంగూరి రవి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తిప్పర్తి జడ్పీటీసీ అభ్యర్థిగా పిల్లి రామరాజు పోటీలో ఉండనున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో కిసాన్‌మోర్చా మండల మాజీ అధ్యక్షుడు వడ్డె శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మైనం మల్లయ్య, పగిడోజు బ్రహ్మచారి, తంగెళ్ల సాయికిరణ్‌రెడ్డి, దేసోజు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్క నాటుతున్న నాయకుడు మధుసూదన్‌రెడ్డి

చిట్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలనీ బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం 11ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యమినిస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహాలింగం, కూరెల్ల శ్రీను, బొడిగె అశోక్, కందాటి చంద్రారెడ్డి, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు స్వాతి

శాలిగౌరారం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గ్యాట్ ప్రతినిధి ఎర్ర శంభులింగారెడ్డి, జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు కోరారు. శనివారం మండలంలోని భైరవునిబండ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి వారు నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పలువురికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని సూర్యాపేట కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం దాత భైరవునిబండ మాజీ సర్పంచ్ దండ రేణుక- అశోక్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్ బాబు, ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, సభ్యులు డెంకల సత్యనారాయణ, కప్పల శ్రీకాంత్, డాక్టర్ బంగారు స్వాతి, క్యాంప్ ఇన్‌చార్జి వీరేంద్రాచారి, గ్రామస్థులు పాల్గొన్నారు

రేపు వైద్యశిబిరం

నల్లగొండకల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పెన్షనర్స్ భవనంలో ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆసుపత్రి డాక్టర్లు పెన్షనర్స్‌కు ఉచితంగా కంటి వై ద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పెన్షన ర్స్ సంఘం నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యామ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలు చేసిన అనంతరం అవసరమైన వారిని హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయనునన్నట్లు తెలిపారు. కావున పెన్షనర్లు హెల్త్ కార్డు తీసుకోని రావాలని కోరారు. వివరాలకు 9000016209 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరిషత్ ఎన్నికలపై కమలం కన్ను

(5వ పేజీ తరువాయి)

క్యాడర్‌కు పార్టీ ముఖ్యనేతలు సూచించారు.

స్థానాలను గుర్తించే పనిలో కీలక నాయకులు

జడ్పీటీసీ స్థానాల్లో పోటీచేసి సత్తాచాటితే ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని అధిష్ఠానం తేల్చిచెప్పడంతో కీలక నాయకులు వారు ఎక్కడి నుంచి పోటీచేయాలనే దిశగా సమాలోచనలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు, జిల్లా పార్టీల అధ్యక్షులు, ముఖ్యనాయకులు ఈ దిశగా స్థానాలను ఎంచుకునే పనిలో పడ్డారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి నల్లగొండ, చౌటుప్పల్ మండలాల్లో ఎక్కడ జనరల్ అయితే అక్కడ పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, నల్లగొండలో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ప్రస్తుతం బీజేపీలో ఉన్న పిల్లిరామరాజు యాదవ్ సైతం నల్లగొండ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ పోటీచేయాలని నిర్ణయించుకొని ఇప్పటికే మండలాల పర్యటనలు ప్రారంభించారు. బీజేపీ మహిళా నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి నల్లగొండ, నకిరేకల్ స్థానాల్లో రిజర్వేషన్లు, పార్టీ అవకాశం ఎక్కడ కల్పిస్తే అక్కడ పోటీ చేసేందుకు వీలుగా క్యాడర్‌తో టచ్‌లో ఉన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యేగా పోటీచేసిన సాధినేని శ్రీనివాస్‌రావు, ఆ నియోజకవర్గంలో ఎక్కడ జనరల్ అయితే అక్కడ పోటీ చేయాలని క్యాడర్‌ను సమాయత్తం చేయడంతో పాటు, అన్ని మండలాల్లో బలమైన పోటీ ఇచ్చే వారిని బరిలో దింపేందుకు సిద్ధం చేస్తున్నారు. మొత్తంగా పరిషత్ ఎన్నికలపై పార్టీ గతానికి భిన్నంగా ఫోకస్ పెట్టడంతో పార్టీ నాయకుల్లో, క్యాడర్‌లో కదలిక వచ్చింది. నాయకులంతా గ్రామాల బాట పట్టడంతో క్యాడర్‌లో జోష్ మొదలైందనే చర్చ సాగుతోంది.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	581.30 (286.7635)	1,20,339	36,033
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,736.89	1,736.89
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.411 (20.5877)	32,064	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

పరిషత్ ఎన్నికలపై
కమలం కన్ను



- ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించేవారంతా జడ్పీటీసీలుగా బరిలోకి
- ఎంపీటీసీ స్థానాల్లో బలమైన పోటీకి సన్నాహాలు
- స్పష్టమైన ఆదేశాలిచ్చిన అధిష్ఠానం
- పార్లమెంట్ ఎన్నికల ఊపును కొనసాగించాలని సూచన
- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే వ్యూహం

పార్లమెంట్ ఎన్నికల ఊపును పరిషత్ ఎన్నికల్లో కొనసాగించాలని బీజేపీ నిర్ణయించింది. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థిత్వం ఆశించాలంటే పరిషత్ ఎన్నికల్లో పనితీరు కొలమానంగా భావిస్తామని అధిష్ఠానం తేల్చిచెప్పింది. దీంతో బీజేపీ ముఖ్య నాయకులు ఆయా నియోజకవర్గాల్లో జడ్పీటీసీలుగా పోటీచేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఎమ్మెల్యేగా పోటీచేయాలని ఆశిస్తున్న నాయకులంతా వారు ఆయా నియోజకవర్గం పరిధిలో ఏదో ఒక మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేయాలని పార్టీ సూచించింది. జడ్పీటీసీ సభ్యులుగా కీలక నాయకులంతా పోటీలో ఉండడంతో పాటు ప్రతీ ఎంపీటీసీ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిని నెలబెట్టడమేగాక కీలకమైన స్థానాలు గెలవాలని నిర్దేశించింది. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి చంద్రశేఖర్ తివారీ ఈ మేరకు ముఖ్య నేతలకు సూచించడంతో ఇటీవల జరిగిన జిల్లా, మండల స్థాయి వర్క్‌షాపులలో ఈమేరకు స్పష్టమైన ఆదేశాలు, కార్యాచరణను ఖరారు చేశారు. కమలం పార్టీ ద్వారా రాజకీయ భవిష్యత్ ఆశిస్తున్న నాయకులు ఇప్పటికే తాము పోటీచేయడానికి మండలాలను ఎంచుకునే పనిలో పడగా, మరికొందరు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

క్షేత్రస్థాయి బలోపేతానికి కార్యాచరణ

గడచిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో మొత్తంగా ద్వితీయ స్థానంలోకి నిలవగా, అసెంబ్లీల వారీగా పరిశీలిస్తే నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి, ఆలేరు, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. మిగిలిన నియోజకవర్గాల్లో మూడో స్థానంలోకి వచ్చినా ఓట్లు గణనీయంగా పెరిగాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఉన్న అధిష్ఠానం అందుకు పరిషత్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. పరిషత్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను దింపడం ద్వారా అధికార పార్టీకి సవాల్ విసరడమే కాకుండా, వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలిచేందుకు ఇప్పటినుంచే కార్యాచరణ అమలు చేయాలని సూచించింది. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయాలని ఉవ్విళ్లూరే నాయకులు ఈ పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాలకు పోటీచేసిన నాయకులు, ఎమ్మెల్యే టికెట్ ఆశించిన నాయకులతో పాటు, భవిష్యత్‌లో ఎమ్మెల్యేగా పోటీచేయాలని భావించే నాయకులంతా పరిషత్ ఎన్నికల్లో వారి నియోజకవర్గాల్లో ఏదో ఒక మండలం నుంచి జడ్పీటీసీగా పోటీచేసి గెలవాలని పార్టీ సూచించింది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌తో పాటు, జిల్లా, మండల స్థాయి వర్క్‌షాప్‌లలో క్యాడర్‌కు సైతం ఈ విషయంపై స్పష్టమైన కార్యాచరణ అందించింది. ఎంపీటీసీ స్థానాలకు సైతం నామమాత్రంగా పోటీచేసే విధానానికి స్వస్తి చెప్పాలని సూచించింది. ప్రతీ ఎంపీటీసీ స్థానం పరిధిలో ఓటర్ల జాబితాలు, స్థానిక పరిస్థితులు, అక్కడున్న సామాజిక స్థితి, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకొని, గెలవాలంటే ఎలాంటి వ్యూహం అమలు చేయాలో నిర్ణయించాలని సూచించింది. ఎంపీటీసీ స్థానానికి పోటీ చేయడానికి పార్టీలో సమర్థ నాయకులు లేకుంటే తటస్థులు, ఆ ప్రాంతంలో పేరు ప్రఖ్యాతులున్న వారిని పార్టీలోకి ఆహ్వానించి, వారిని పోటీకి ఒప్పించే బాధ్యతను సైతం జడ్పీటీసీ సభ్యులుగా పోటీచేసేవారే తీసుకోవాలని దిశానిర్దేశం చేసింది. ఇప్పటినుంచే ప్రాదేశిక నియోజకవర్గాలు, మండలాలు, జిల్లాల వారీగా ప్రజల సమస్యలు గుర్తించి వాటిపై పోరాటాలు ప్రారంభించాలని, ఆ పోరాటాలే ప్రచారస్త్రాలుగా మలుచుకోవాలని

మిగతా 8వ పేజీలో...

నిద్రలోనే అనంతలోకాలకు

- చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు డీఎస్పీలు మృత్యువాత, ఒక ఏఎస్పీ, హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు
- మృతులు, క్షతగాత్రులంతా ఏపీ రాష్ట్రవాసులు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం, (ఇన్‌సెట్‌లో) ఈ డివైడర్‌కు ఢీకొట్టడంతో వాహనం ఎగిరిపడింది

ఇంకో గంటలో గమ్యాన్ని చేరుకుంటారనే లోపే మృత్యువు చేరువైంది. విధి నిర్వహణలో అలసిపోయిన వారు, కొంచెం సేపు కునుకు తీద్దామనుకుంటే.. శాశ్వత నిద్ర దగ్గరైంది. దీంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మృతి చెందగా, ఒక ఏఎస్పీ, మరో హెడ్‌కానిస్టేబుల్ గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా హైదరాబాద్ వెళుతుండగా, తెల్లవారుజామున 4.45కు ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో, ఆ వాహనాన్ని తప్పించబోయి వీరు ప్రమాదం బారిన పడ్డారు.

వివరాలు ప్రధాన సంచికలో..

ఎరువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాడ్గులపల్లిలో సొసైటీని తనిఖీచేసి వివరాలు అడిగితెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగార్జున డిస్ట్రిక్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీని ఆయన తనిఖీచేసి రికార్డులను, ఎరువుల స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. డీలర్లు ఈ-పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, వ్యవసాయేతర అవసరాలకు మళ్లించే దుకాణదారులపై చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జేడీఏ శ్రవణ్‌కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం జ్యోతి, డీసీవో పత్యానాయక్, ఏవో శివరాంకుమార్, డీలర్లు యాదగిరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కర్లపాటి శ్రీను, ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

(ఆంధ్రజ్యోతి, వేములపల్లి): పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన యూరియా విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని ఆయన తనిఖీచేసి యూరియా గోదాం, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన ప్రతీ యూరియా బస్తాను రైతులకే అందించాలన్నారు. జిల్లాలో సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు సైతం మోతాదుకు మించి వినియోగించవద్దని సూచించారు. పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన యూరియాను ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించి సరఫరా చేయాలన్నారు. విక్రయించిన ఎరువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా సహకార అధికారి పత్యానాయక్, జేడీఏ శ్రవణ్‌కుమార్, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణ, మార్కెటింగ్ జిల్లా మేనేజర్ జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ జడరాములుయాదవ్, ఏవో కిశోర్‌నాయక్, మార్కెటింగ్ ఇన్‌చార్జి స్వామి, ఏఈవో నితిన్, సీఈవో రవీందర్‌రావు, రాజు, యువాన్, గిరి, యాదగిరి, సూరి ఉన్నారు.

యూరియాను పక్కదారిపట్టిస్తే క్రిమినల్ కేసు

- పరిశ్రమలు ఇండస్ట్రియల్ యూరియానే వినియోగించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్



చిట్యాల మండలంలో డీఈఎఫ్ ఆయిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాలరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని రాయితీ యూరియాను ఎవరైనా పక్కదారి పట్టిస్తే ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. శనివారం చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఎడీబ్లూ డీఈఎఫ్ ఆయిల్ విక్రయించే కౌంటర్‌ను కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. డీఈఎఫ్ ఆయిల్‌లో కలిపే యూరియా ఎలా వస్తుందో పరిశీలించారు. పంటపొలాలకు వినియోగించే రాయితీ యూరియాను కేవలం వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, ఇతరత్రా అవసరాలకు కాదన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు, రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయించే ఎరువులు, యూరియాపై అధికారులు నిఘా ఏర్పాటుచేయాలని సూచించారు. అదేవిధంగా యూరియా సరఫరా, విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేయడమేగాక ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, చెక్‌పోస్టులు కూడా ఏర్పాటుచేశామన్నారు. పరిశ్రమలు రాయితీ యూరియాను వినియోగిస్తున్నట్టు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట జేడీఏ శ్రవణ్‌కుమార్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జి.కృష్ణ, వ్యవసాయాధికారి గిరిబాబు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, చిట్యాల): చిట్యాల ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘంలోని ఎరువుల స్టాక్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. యూరియాను వినియోగించే అనుమానాస్పద పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): విద్యార్థులకు చదువుపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర కళాశాలను వారు తనిఖీచేశారు. తరగతి గదులను, నిత్యావసర వస్తువుల స్టోర్‌రూంను పరిశీలించారు. సమస్యలపై ప్రిన్సిపాల్‌ను అడగ్గా, అద్దె భవనంలో కొనసాగుతోందని, పక్కా భవనం నిర్మాణంలో ఉందని వివరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశలను నిజం చేసేలా చదవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, మేథస్సును పెంచే ఆటలపై ఆసక్తి చూపించాలన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి బారిన పడిన యువకుల జీవితాలు ఎలా నాశనమయ్యాయో వివరించి హెచ్చరించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకుంటూ భావి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో అధ్యాపకుల అవతారమెత్తి జీవిత పాఠాలు చెప్పారు. వారి వెంట ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, ఆర్ఐ తరుణ్, తదితరులు ఉన్నారు.

29న సాగర్ గేట్ల ఎత్తివేత?

- 581.30 అడుగులకు చేరుకున్న నీటిమట్టం
- గరిష్ఠ నీటిమట్టానికి మరో తొమ్మిది అడుగుల దూరం

7

30న డిండి ప్రాజెక్టు నీటి విడుదల

- ప్రస్తుతం ప్రాజెక్టులో 16 అడుగుల నీటిమట్టం

7

మూసీ నుంచి విడుదలవుతున్న నీరు

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్

నల్లగొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ లీగల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ లీగల్ సెల్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ ద్వారా పదవులు పొందిన న్యాయవాదులు పార్టీ కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయ సహాయం అందించాలన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అడ్వకేట్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ బిల్లు పాస్ అవుతుందని అన్నారు. న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు నాంపల్లి నర్సింహ, ఏజీపీలు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వీరయ్య, న్యాయవాదులు నామిరెడ్డి మోహన్‌రెడ్డి, మోమీన్ రోషన్ జమీర్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గొడకొండ్ల గ్రామపంచాయతీ వెంకటేశ్వరనగర్ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, మందుల లభ్యతను పరిశీలించారు. డెంగీ, మలేరియా చికిత్స కోసం అందుబాటులో ఉన్న ఆర్‌డీటీ కిట్ల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రుగ్మతలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

నేడు దేవరకొండకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్

దేవరకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 27న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు దేవరకొండలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన, 11 గంటలకు చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. మంత్రి పర్యటనకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ మాదిగ

నల్లగొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పెన్షన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ విమర్శించారు. శనివారం స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్‌దారుల సంక్షేమంపై అధికార, ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకొని పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే పెన్షన్‌దారుల పక్షాన మంద కృష్ణ మాదిగ మరో పోరాటానికి శ్రీకారం చుడతారని హెచ్చరించారు. ఆగస్టు 1న మిర్యాల గూడలో దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల జిల్లా సన్నాహక సభను నిర్వహిస్తున్నామని, దీనికి మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. మాసారం వెంకన్నమాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జానకిరామయ్య చౌదరి, గాదె రమేష్‌మాదిగ, ఇరిగి శ్రీశైలంమాదిగ, కురుపాటి కమలమ్మ, కొత్త వెంకన్నయాదవ్, ఊదరి నవీన్, నక్కా అశోక్, మేడబోయిన నగేష్, యాదయ్య, ఉపేందర్, తుమ్మల లక్ష్మారెడ్డి, మదన్, బన్నీ, పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి'

కొండమల్లేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌పై అసత్య ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి సామగ్రి, ఫర్నిచర్, ఏసీలు, కుర్చీలు, సోఫా సెట్‌లను తీసుకెళ్లారని పేర్కొన్నారు. దేవరకొండ ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

చింతపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు దేవాలయాన్నీ గోపంచకంతో సంప్రోక్షణ జరిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ అల్వాల జంగయ్య, అర్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్



బాలెంపల్లిలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని బాలెంపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని పండుగ విశిష్టతను తెలిపారు. గ్రామంలో పెళ్లి కాని గిరిజన యువతులు బుట్టలో గోధుమ విత్తనాలు చల్లి మొలకలు వచ్చే వరకు నీటిని చల్లుతారని, మొలకెత్తిన బుట్టలను ప్ర త్యేక వస్త్రాధారణతో ఆడిపాడి సమీప వాగుల్లో నిమజ్జనం చేస్తారని అన్నారు. దేశంలో ఏ తెగకు లేనట్లుగా మొలకలకు పూజలు చేసే సంప్రదాయం గిరిజన తెగల్లో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పంటలు బాగా పండి రైతన్నలకు లాభాలు అధికంగా రావాలని గిరిజన దేవతలను కోరుకన్నట్లు తెలిపారు. గిరిజనులు తీజ్ పండుగను ఘనంగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, షూస్ అందిస్తున్న దాతలు

పెద్దవూర, జూలై 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చింతపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం దాతలు గుర్రం సురేందర్‌రెడ్డి స్కూల్ బ్యాగ్‌లు అందించగా సుంకిరెడ్డి ప్రభావతి సంజీవరెడ్డి 35 జతల షూస్ గోర్ల యాదగిరి టై బెల్ట్, ఐడీ కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో తరి రాము మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనుంజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా మల్లేష్‌గౌడ్

వేములపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న కల్యాణలక్ష్మి పథకానికి తోడు ఇందిరమ్మ కానుక కింద అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పి నేటికి అందివ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 4వేల వరకు కల్యాణలక్ష్మి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మహిళలు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కాంత్రగడ్డ రాజగోపాల్‌రావు, నాయకులు పెదపంగ సైదులు, కట్టా వెంకటయ్య పాల్గొన్నారు.


బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాయం భూపాల్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల నాయకుడు దాయం ఉపేందర్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రంలో శనివారంఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాల్లోని ప్రజలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, సర్నాల జానకిరాములు, వేముల లక్ష్మణ్, జక్క ఇందిర, దారమళ్ల నాగరాజు, భిక్షనాయక్, యాదగిరి, చంటి, సైదులు, వెంకన్న, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ పనులు ప్రారంభించాలి



ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి(సాగర్), జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకుని తండాలో సబ్‌స్టేషన్ పనులను వెంటనే ప్రారంభించాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలువురు విద్యుత్ అధికారులకు వినపత్రం అందజేశారు. శనివారం మిర్యాలగూడ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఫోరం పరిష్కార వేదిక సమావేశంలో వారు అధికారులను కలిసి సమస్య గురించి వివరించారు. నాయకునితండా సమీపంలో సబ్‌స్టేషన్ మం జూరై ఐదేళ్ల దాటిందని, అందుకు సంబంధించిన నిధులు కూడా మంజూరైనప్పటికీ పనులను ప్రారంభించడం లేదని, దీని వల్ల లోవోల్టేజీ కారణంగా వినియోగదారులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే సబ్ స్టేషన్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెరావత్ మునినాయక్, మెరావత్ నాగేందర్‌నాయక్, బిచ్యానాయక్, రవీందర్, శౌరి, బాలు, బిక్కునాయక్, కొండలు ఉన్నారు.

శిథిలావస్థలో నిడమనూరు పోలీస్‌స్టేషన్

● ఈ నెల 30న మండల కాంప్లెక్స్ భవనంలోకి పోలీస్‌స్టేషన్ తరలింపు



స్టేషన్‌ను తరలించనునున్న మండల పరిషత్ కాంప్లెక్స్ భవనం.



పోలీస్‌స్టేషన్‌లో పెచ్చులూడుతున్న పైకప్పు

నిడమనూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థలకు చేరుకుంది. దీంతో ఈనెల 30 నుంచి మండల కాంప్లెక్స్ భవనంలో కి పోలీస్‌స్టేషన్‌ను తరలించనున్నారు. మూడుదశాబ్దాల క్రితం నిర్మించిన భవనం కావడంతో తరచుగా పైకప్పు పెచ్చులు ఊడిపడుతూ ప్రమాదకరంగా మారింది. సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నదుస్థితి ఉంది. ఎప్పుడు కూలుతుందోనని ఇటు సిబ్బంది అటు స్టేషన్‌కు వచ్చే ప్రజలు సైతం భయాందోళనకు గురవుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో కొంత భాగాన్ని వినియోగించడమే మానేశారు. ఇటీవల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు వచ్చిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు స్థానిక ఎస్‌ఐ ఉప్పు సురేష్ స్టేషన్ ప రిస్థితి వివరించారు. దీంతో భద్రత దృష్ట్యా సురక్షిత భవనంలోకి పోలీస్‌స్టేషన్‌ను మార్చాలని సూచించారు. పైగా నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో శిథిలమైన పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంది. 1994లో అప్పటి వ్యవసాయ మంత్రి కుందూరు జానారెడ్డి, అప్పటి ఎస్పీ గోపీనాథ్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు పక్కా భవనాన్ని ప్రారంభించారు. స్టేషన్‌తో పాటు పోలీస్ క్వార్టర్స్ కూడా శిథిలమయ్యాయి. దీంతో కలెక్టర్ అనుమతితో మండల కేంద్రంలోని మండల పరిషత్ కాంప్లెక్స్ భవనంలోకి స్టేషన్‌ను మార్చనున్నారు. ఈ మేరకు మండల కాంప్లెక్స్ భవనంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భవనం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, అపరిశుభ్ర వాతావరణాన్ని శుభ్రం చేయించారు. ఈ నెల 30 నుంచి మండల పరిషత్ కాంప్లెక్స్ భవనంలోకి స్టేషన్‌ను మార్చి అక్కడి నుంచే విధులు నిర్వహించనున్నారు. కాగా ఇదే భవనంలో పదేళ్లుగా మునిసిప్ కోర్టు కార్యకలాపాలు నిర్వహించారు. ఇటీవల కోర్టు నిర్వహణకు రూ.5.25 కోట్ల నిధులతో పక్కా భవనం నిర్మించారు. దీంతో కాంప్లెక్స్ భవనం ఖాళీగా ఉం డటంతో అందులోకి పోలీస్‌స్టేషన్‌ను మార్చనున్నారు. భవనాన్ని వినియోగిస్తున్నందుకు నెలకు రూ.12 వేలు మండల పరిషత్ కార్యాలయానికి అద్దె చెల్లిస్తున్నట్లు తెలిసింది.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం



వేములపల్లి పీఏసీఎస్‌లో గోదామ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

వేములపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా కేసులను నమోదు చేస్తామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో శనివారం యూరియా గోదామ్‌ను ఆయన తహసీల్దార్ హేమలతతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా సిబ్బంది ముందస్తు కార్యాచరణతో వ్యవహరించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలన్నారు. భూభారతి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు నోటీసులు అందించి క్షేత్రస్థాయిలో సైతం పరిశీలించి వేగవంతంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, పీఏసీఎస్ ఛైర్మన్ జడరాములుయాదవ్, సీఈవో రవీందర్‌రావు, ఏవో కిశోర్‌నాయక్, ఏఈవో నితిన్, కార్యాలయ సిబ్బంది రాజు, గిరి ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం : ఎమ్మెల్యే



ఆహారాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన అల్పాహార పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీల్స్ ఆన్ వీల్స్ పేరుతో క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమం గొప్పగా ఉందన్నారు. రోగులు, వారి సహాయకులకు నిత్యం అల్పాహారాన్ని అందిస్తూనే ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాలకు హాజరైన తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు లయన్స్ క్లబ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్య, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ఆహార పంపిణీ చేయడం మంచిదన్నారు. అనంతరం క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జాడి రాజు, బీఎం నాయుడు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, క్యామ వెంకటేశం, కర్నాటి రమేష్, భాగ్యలక్ష్మి, మంగతాయి, మురహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి

● శ్రావణకుమారి, ఏవో చింతపల్లి



ఇంటర్వ్యూ Interview

వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని చింతపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణకుమారి తెలిపారు. వానాకాలంలో ఎలాంటి పంటలు తదితర విషయాలు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ఆంధ్రజ్యోతి: వానాకాలంలో రైతులు ఎలాంటి పంటలు ఎంపిక చేసుకోవాలి ?

ఏవో: మొక్కజొన్న, పప్పు దినుసులు, మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయలను సాగు చేయాలి.

ఆంధ్రజ్యోతి: పంటల దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి ?

ఏవో: భూమికి బలా న్ని ఇచ్చే ఇనుము, జీలుగ పంటలను ఎక్కువ శాతం సాగు చేసి భూమిలో కలియదున్నాలి.

ఆంధ్రజ్యోతి: కల్తీ ఎరువులు, విత్తనాలను విక్రయించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

ఏవో: ఇప్పటికే అన్నీ ఎరువుల విత్తనాల దుకాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశాం. అనుమతి పొందిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేయాలి.

ఆంధ్రజ్యోతి : మిషన్‌తో నాట్లు వేయడం వల్ల వరి ఎర్రగా మారుతుంది వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి ?

ఏవో: వరినాట్లు వేసే క్రమంలో పొలంలో ఉన్న నీటిని ప్రతి రోజు ఉదయం బయటకు వదిలివేయాలి. చలి ప్రభావంతో నాట్లు ఎర్రగా మారింది. లీటర్ నీటిలో జింక్ వేసి పిచ్చికారి చేయాలి.

ఆంధ్రజ్యోతి: వరి దిగుబడికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి ?

ఏవో: పంటల దిగుబడి పెరగడానికి సూపర్‌తో పాటు డీపీఏ వేయాలి. పొట్ట దశలో యూరియా పోటాషియం వేయండి. 45 రోజుల తరువాత పిలకలు వేసే దశలో యూరియా వేయాలి.

చట్టాలపై అవగాహన కల్పించాలి

● దేవరకొండ మునిసిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత



దేవరకొండ : సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని ఇందుకు మండల లీగల్‌సెల్ అథారిటీ అవగాహన కల్పిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ దేవరకొండ ఛైర్మన్ సీనియర్ సివిల్‌జడ్జి కె. అనిత అన్నారు. దేవరకొండ మునిసిఫ్ కోర్టు ప్రాంగణంలో శనివారం మండల లీగల్‌సెల్ జాగృతి అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రతి గడపకు మండల లీగల్‌సెల్ అథారిటి చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ దేవరకొండ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, గాజుల ఆంజనేయులు, మాడెం రాములు, ముస్తాక్, వనం జగదీశ్వర్, దేవరకొండ సీఐ నర్సింహులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేణు



పందిరి వేణు

మిర్యాలగూడ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పందిరి వేణును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తమరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం వేణు విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకుముంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన సంఘ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకతీతంగా సంఘ సభ్యులందరినీ ఏకం చేస్తానన్నారు. కాగా రాష్ట్ర, జిల్లా కమిటీలో పలు బాధ్యతలు నిర్వహించిన వేణు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం కావడం పట్ల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా, జూలై26 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు.హాలియాలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన పెద్దవూర మండల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయంతో పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజ యం సాధించేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని గ్రామాల్లో చర్చ పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, సలహాదారుడు చెన్ను సుందర్‌రెడ్డి, పొ దిల శ్రీనివాస్, రమావత్ రవినాయక్, శ్రీకర్‌నాయక్, రావుల శ్రీను, లక్ష్మణ్, రాజేష్‌నాయక్, దస్రూ నాయక్, రాజేష్‌నాయక్, గురువారెడ్డి, చీనానాయక్, బాలవర్ధిరాజు, పాల్గొన్నారు.

డీ-8.9 కాల్వ పనులను పూర్తి చేయాలి

పెద్దవూర : మండలంలో వరద కాల్వలో అంతర్భాగమైన డీ-8,9 కాల్వ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ప్రభుత్వం వెంటనే పనులను పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. డీ-8,9 కాల్వలను శనివారం ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి కాల్వల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జటావత్ రవినాయక్, నాయకులు సుందర్‌రెడ్డి, రమావత్ రవినాయక్, పొదిల శ్రీనివాస్, శ్రీకర్, నడ్డి సత్యం, రాజేష్‌నాయక్, వెంకట్‌రెడ్డి, రమావత్ శంకర్‌నాయక్, దస్రునాయక్, కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల కడుపు కొడితే ఊరుకునేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

హాలియా, జూలై26(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల కడుపుకొడితే ఊరుకునేది లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపట్ల రమేష్ అన్నారు. హాలియాలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా కుల వృత్తిని నమ్ముకొని బతుకుతున్న తమపై ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి తమ పొట్టకొట్టడానికి ప్రయత్నించిన తరుణంలో గ్రామపెద్దల మద్దతుతో హాలియాలో వారు ఏర్పాటు చేస్తున్న హెయిర్ సెలూన్ ఎదుట నిరసన తెలిపిన తమపై అక్రమ కేసులు పెట్టి కోర్టు నుంచి నోటీసులు పంపడాన్ని తీవ్రంగా ఖండించారు. నాయీ బ్రాహ్మణులకు సహకరించి హెయిర్ సెలూన్ ఏర్పాటు కార్యక్రమన్ని విరమించుకోవాలన్నారు. లేని యెడల పెద్దఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నాగేళ్ల నరేందర్, మండల అధ్యక్షులు సురభి రాంబాబు, పట్టణ అధ్యక్షుడు పేరూరి కోటయ్య, రాచమళ్ల భరత్‌కుమార్, సురభి శేఖర్, సురభి నరేందర్, లింగయ్య, శంకరయ్య, సురభి కృష్ణయ్య, సురభి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి పట్టణంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అజ్మీరా రమేష్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా, ఫోన్ మాట్లాడుతూ, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు వాహన తనిఖీలలో 20 మంది ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలలో సిబ్బంది రాము, నవీన్‌రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

'కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి '

డిండి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతండా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తహరొద్దిన్‌ను విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శుల ప్రమేయం లేనప్పటికీ కార్యదర్శులను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం సరికాదన్నారు.

సస్పెండ్ చేసిన కార్యదర్శిని విధుల్లోకి తీసుకునేవరకు జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులంతా విధులను బహిష్కరిస్తారని ఆయన తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హుల జాబితాలను ఇచ్చారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులను పనికిరాని చెత్తగా కలెక్టర్ ఆపాదించడం సరికాదన్నారు. పనిష్మెంట్ కింద కొందరు పంచాయతీ కార్యదర్శులను డిండికి పంపడం వల్లనే సమస్యలు వస్తున్నాయని ఆయన అన్నారు. సస్పెండ్ చేసిన కార్యదర్శిని విధులలోకి తీసుకునేవరకు తాము విధులలో చేరమని స్పష్టం చేశారు.

పరిషత్ ఎన్నికలపై కమలం కన్ను

(5వ పేజీ తరువాయి)

క్యాడర్‌కు పార్టీ ముఖ్యనేతలు సూచించారు.

స్థానాలను గుర్తించే పనిలో కీలక నాయకులు

జడ్పీటీసీ స్థానాల్లో పోటీచేసి సత్తాచాటితే ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని అధిష్ఠానం తేల్చిచెప్పడంతో కీలక నాయకులు వారు ఎక్కడి నుంచి పోటీచేయాలనే దిశగా సమాలోచనలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీచేసిన ఎమ్మె ల్యే అభ్యర్థులు, జిల్లా పార్టీల అధ్యక్షులు, ముఖ్యనాయకులు ఈ దిశగా స్థానాలను ఎంచుకునే పనిలోపడ్డారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి నల్లగొండ, చౌటుప్పల్ మండలాల్లో ఎక్కడ జనరల్ అయితే అక్కడ పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, నల్లగొండలో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ప్రస్తుతం బీజేపీ లో ఉన్న పిల్లిరామరాజు యాదవ్ సైతం నల్లగొండ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ పోటీచేయాలని నిర్ణయించుకొని ఇప్పటికే మండలాల పర్యటనలు ప్రారంభించారు. బీజేపీ మహిళా నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి నల్లగొండ, నకిరేకల్ స్థానాల్లో రిజర్వేషన్లు, పార్టీ అవకాశం ఎక్కడ కల్పిస్తే అక్కడ పోటీ చేసేందుకు వీలుగా క్యాడర్‌తో టచ్‌లో ఉన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యేగా పోటీచేసిన సాధినేని శ్రీనివాస్‌రావు, మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎక్కడ జనరల్ అయితే అక్క డ పోటీ చేయాలని క్యాడర్‌ను సమాయత్తం చేయడంతో పాటు, అన్ని మండలాల్లో బలమైన పోటీ ఇచ్చే వారిని బరిలో దింపేందుకు సిద్ధం చేస్తున్నారు. మొ త్తంగా పరిషత్ ఎన్నికలపై పార్టీ గతానికి భిన్నంగా ఫోకస్ పెట్టడంతో పార్టీ నాయకుల్లో, క్యాడర్‌లో కదలిక వచ్చింది. నాయకులంతా గ్రామాల బాట పట్టడంతో క్యాడర్‌లో జోష్ మొదలైందనే చర్చ సాగుతోంది.